క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నానక్‌రాంగూడ విలేజ్, సుమధుర అపార్ట్‌మెంట్, ది శ్రీరామ స్కూల్, గోల్ఫ్ వ్యూ అపార్ట్‌మెంట్స్, బౌల్డర్ హిల్స్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాంతి సరోవర్, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, జీపీఆర్ఏ క్వార్టర్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

16న 'మనూ'లో ప్రత్యేక ఉపన్యాసం

రాయదుర్గం: మనూలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ విమెన్ ఎడ్యుకేషన్ (డీడబ్ల్యూఈ) విభాగం ఆధ్వర్యంలో సఫ్దరియా గార్ల్స్ హైస్కూల్ సహకారంతో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని డీడబ్ల్యూఈ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ అమీనా తహసీన్ మంగళవారం తెలిపారు. ఈనెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు సయ్యద్ హమీద్ లైబ్రరీ ఆడిటోరియంలో సుగ్రహుమయూన్ మీర్జా స్మారక ఉపన్యాసాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 'భారత రాజ్యాంగం, లింగ సమానత్వం, యూనిఫామ్ సివిల్‌కోడ్' అనే అంశంపై ప్రసంగిస్తారని వివరించారు.

ప్రియాంక కుమారికి పీహెచ్‌డీ



రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థిని ప్రియాంకకుమారికి మంగళవారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఉర్దూ విభాగంలో పరిశోధక విద్యార్థిని ప్రియాంక హిందీ విభాగం ప్రొఫెసర్ కరణ్‌సింగ్ఉత్వాల్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆమె '21వ శతాబ్దపు హిందీ నాటకాలలో చిత్రీకరించబడిన స్త్రీల జీవిత సామాజిక వాస్తవికత' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు.

విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న అశోక్ తదితరులు

మియాపూర్: పోరాటవీరుడు తాండ్రకుమార్ అని ఎంసీపీఐ(యు) అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రెడ్ మద్దికాయల అశోక్ కొనియాడారు. తాండ్రకుమార్ ప్రథమ వర్ధంతి సందర్భంగా మియాపూర్ క్రాస్ రోడ్ వద్ద స్మారక స్తూపం నుండి ముజాఫర్ అహ్మద్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. స్తూపం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు మహేందర్ నహే, అనుభవ్‌దాస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి



పాపిరెడ్డి కాలనీలో అమరవీరులకు నివాళులర్పించిన నాయకులు

మియాపూర్: పుల్వామ అమరవీరులకు పాపిరెడ్డి కాలనీలో బీజేపి నాయకులు మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపి రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరుణ్‌కుమార్, కుమార్ యాదవ్, నర్సింగ్ యాదవ్, నరసింహచారి, వేణుయాదవ్, చారి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'ఉత్సవాలకు రావాలి'

పటాన్‌చెరు టౌన్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని 18న బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో జరిగే జాతర మహోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందజేశారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ పుష్ప నగేష్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో వార్డు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీనివాసనగర్ కాలనీలోని 13, 14వ బ్లాక్‌లలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు.

మాస్క్‌తో మస్కా..

- నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల నంబర్ ప్లేట్స్‌కు మాస్క్‌లు
- తనిఖీల్లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు





ద్విచక్ర వాహనాల నంబర్ పేట్లకు మాస్కులు



నంబర్ ప్లేట్ లేకుండా ద్విచక్ర వాహనం

మియాపూర్: కరోనా సమయంలో మాస్క్ వాడకం తప్పనిసరి అయ్యింది. ఈ క్రమంలో కొంతమంది ట్రాఫిక్ చలానాలు తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్లకు మాస్కులు వేసి జాతీయ రహదారులపై దర్జాగా తిరుగుతున్నారు. ఏకంగా వాహనాల నంబర్ ప్లేట్లకు మాస్కులు తగిలిస్తున్నారు. ఇలా చేస్తే నిబంధనలు ఉల్లంఘించిన వారవుతారని ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నా వాహనదారులు పట్టించుకోవడం లేదు. మరి కొంతమంది ఒకటి, రెండు నంబర్లు కనిపించకుండా సినీ హీరోలు, క్రికెటర్ల ఫొటోలు పెట్టుకుంటున్నారు. తనిఖీల్లో పట్టుబడినా మార్పు రావడం లేదు. జాతీయ రహదారిపై నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు తిరుగుతున్నాయి. రాంగ్ రూట్, ట్రిబుల్ రైడింగ్, సిగ్నల్ జంప్, డ్రైవింగ్‌లో ఫోన్ మాట్లాడడం, డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు హెల్మెట్లు లేకుండా ప్రయాణిస్తున్నారు. చలానాలు తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్స్‌ను వంచడం, కనబడకుండా చేయడం, మాస్కులు తగిలించడం చేస్తున్నారు. ఏవైనా ప్రమాదాలు జరిగినపుడు ఆయా వాహనాలను గుర్తించడం ఎలా అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనుల పట్ల ట్రాఫిక్ పోలీసులు తగుచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కఠిన చర్యలు

నంబర్ ప్లేట్లను తొలగించడం, మాస్కులు, రేడియం స్టిక్కర్లు వేయడం నిబంధనలు ఉల్లంఘించడమే. వారికి శిక్ష తప్పదు. ట్రాఫిక్ రూల్స్, ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించడం శ్రీరామరక్షలాంటిది. కొంత మంది ఆకతాయిలు ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. ప్రతిరోజు తనిఖీలు నిర్వహించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

–సుమన్, ట్రాఫిక్ సీఐ

మల్లన్న గుడి నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పాటి గ్రామంలో నూతనంగా చేపట్టిన శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రూ.10లక్షలు విరాళం అందించారు. మంగళవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖుల సమక్షంలో ఎమ్మెల్యే నగదు అందజేశారు. భవిష్యత్‌లో ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్, మాజీ సర్పంచ్‌లు భూపాల్‌రెడ్డి, స్వామి గౌడ్, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మశానవాటిక అభివృద్ధికి వినతి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు శంకర్ తదితరులు

కూకట్‌పల్లి: హైదర్‌నగర్ బస్తీలోని హిందూ స్మశానవాటికను అభివృద్ధి చేయాలని కోరుతూ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమతకు మంగళవారం సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్ మాట్లాడుతూ స్మశానవాటికలో అంతర్గత రోడ్లు, బైపోల్ స్తంభాలు, విద్యుత్ లైట్లు స్నానాల గదులు, ప్రహరీ, సిమెంట్ బల్లలతో పాటు రెండు వాహనాలు ఏర్పాటు చేయాలని కోరామని తెలిపారు. త్వరలో స్మశానవాటికను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారని వారు తెలిపారు. కార్యక్రమంలో మహేష్ గౌడ్, మహేష్ పాల్గొన్నారు.

ముగిసిన క్రాఫ్ట్ బజార్.. అలరించిన ఫ్యాషన్ షో





మాదాపూర్: మాదాపూర్‌లోని నిఫ్ట్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ)లో నిర్వహిస్తున్న క్రాఫ్ట్ బజార్ మంగళవారం ముగిసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్ స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇందులో బిదిరి వేర్, కలంకారి, వరంగల్ దుర్రీస్, బంజారా ఎంబ్రాయిడరీ, లెదర్ పపెట్రీ, చేర్యాల పెయింటింగ్స్, ఏటికొప్పాక బొమ్మలు, నారాయణపేట్ చీరలు, పోచంపల్లి, ఇకత్, ఉదయగిరి ఉడెన్ ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఫ్యాషన్‌షో నిర్వహించారు.

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



ధర్నాలో పాల్గొన్న బీఎంఎస్ నాయకులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఎంఎస్ రాష్ట్ర పబ్లిక్ సెక్టార్ ఇన్‌చార్జ్ రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం చలో హైదరాబాద్‌లో భాగంగా ఇందిరాపార్కు ధర్నాకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై బీఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీహెచ్ఈఎల్ కార్మిక సంఘం అధ్యక్షుడు మహేష్, నాయకులు రాజు, సురేష్, కరుణాకర్, సునీల్, చొడేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య



బంజారాహిల్స్: జూబ్లీ హిల్స్ రోడ్ నం 36లో మెట్రో స్టేషన్ నుంచి పెద్దమ్మ గుడి కమాన్ వరకు, పెద్దమ్మ గుడి వైపు నుంచి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వరకు నిత్యం మురుగు సమస్య వేధిస్తోంది. పలుమార్లు స్థానికులు, పాదచారులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం ఈ దారిగుండా వెళ్లేవారితో పాటు మెట్రో దిగి వెళ్లే పాదచారులు సైతం మురుగు సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

జాతరకు రావాలని గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నందీశ్వర్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరులో ఈనెల 26వ తేదీన నిర్వహించే రేణుక ఎల్లమ్మ జాతరకు రావాలని గవర్నర్ తమిళిసైని ఆహ్వానించారు. పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత నందీశ్వర్ గౌడ్ కుటుంబ సమేతంగా గవర్నర్ వద్దకు వెళ్లి పుష్పగుచ్ఛం ఇచ్చి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు.

గీతంలో ప్రమాణ-2023 ఫెస్ట్

పటాన్‌చెరు టౌన్: రుద్రారంలోని గీతం డీమ్డ్ వర్సిటీలో ఏటా నిర్వహించే మూడు రోజుల సాంకేతిక, సాంస్కృతిక, యాజమాన్య (టెక్నో, కల్చరల్, మేనేజ్‌మెంట్ ఫెస్ట్) ఫిబ్రవరి 15 నుంచి 17వరకు నిర్వహిస్తారని ఫెస్ట్ చైర్మన్ డాక్టర్ త్రినాథరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.గీతం విద్యార్థులతో పాటు జంట నగరాల చుట్టుపక్కల నుంచి, ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా ఈ ఫెస్ట్‌లో పాల్గొనడానికి ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్నారని, దాదాపు ఇరవై వేల మంది పాల్గొననున్నట్లు కన్వీనర్ తెలిపారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

పటాన్‌చెరు టౌన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు అంగన్‌వాడీలు మంగళవారం వెళ్లారు. వారిలో రాధిక, రూప, కల్పన, శోభ, సరళ, ఇందిర, విజయలక్ష్మి, గాయత్రి, ఇందిర ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మియాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని బంగారం వైన్స్ షాపు ఎదురుగా ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) రోడ్డు మీద పడి ఉన్నట్లు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మసీదు నిర్మాణానికి విరాళం

పటాన్‌చెరు: మసీదు నిర్మాణానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం విరాళం అందజేశారు. ప్రతి ఒక్కరూ పరమత సహనం పాటించాలన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని అమీనా అలంగిర్ మసీదు పునర్నిర్మాణానికి మొదటి విడతగా రూ.25లక్షలు మసీదు కమిటీ ప్రతినిధులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆయా వార్డుల కౌన్సిలర్లు, మత పెద్దలు పాల్గొన్నారు.

పార్కులు వెలవెల

వెంకటేశ్వరకాలనీ: నిత్యం ప్రేమ జంటలతో కిటకిటలాడే బంజారాహిల్స్ రోడ్ నం. 1లోని జలగం వెంగళ్‌రావు పార్కు ప్రేమ జంటలు లేక మంగళవారం వెలవెలబోయింది. ప్రతియేటా మాదిరిగానే ఈ సారి కూడా కొన్ని సంస్థలు వాలంటైన్స్ డే సందర్భంగా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ప్రేమికులు పార్కులకు రావడానికి భయపడ్డారు. మరో వైపు పార్కుల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు బంజారాహిల్స్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఖాజాగూడ మోడల్ కారిడార్ పరిశీలన



ఖాజాగూడలో మోడల్ కారిడార్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్ఎంసీ అధికారులు

రాయదుర్గం: ఖాజాగూడలోని మోడల్ కారిడార్‌ను రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ పరిశీలించారు. మంగళవారం జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి అధికారులతో కలిసి ఆయన ఖాజాగూడలోని మోడల్ కారిడార్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఖాజాగూడ రోడ్డులో వెంటనే రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, సైకిల్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. మొదట దాబా కూడలి నుంచి మధురానగర్, ఖాజాగూడ మీదుగా ఓఆర్ఆర్ రోడ్డు వరకు కారిడార్‌ను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో ఈ రోడ్డుపైనే మెట్రో కూడా వస్తుందని అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఎన్‌సీ మహ్మద్ జియావుద్దిన్, వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ శంకరయ్య, ఎస్ఈ శంకర్, ఈఈ శ్రీనివాస్, రోడ్డు విస్తరణ అధికారి గణపతి, సీపీ మల్లికార్జున్, డీఈ రమేష్, డీఈ విశాలక్ష్మి, ఏఈ జగదీష్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పర్యటన



అడ్డగుట్టలో పాదయాత్ర చేస్తున్న యోగానంద్ తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: స్థానిక హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అడ్డగుట్టలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్ మంగళవారం పాదయాత్ర చేపట్టారు. డ్రైనేజీ, నీరు, ట్రాఫిక్, విద్యుత్, పార్కింగ్ వంటి సమస్యలు ప్రధానంగా ఉన్నాయన్నారు. అడ్డగుట్టలో ఉన్న రోడ్లు, విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ, కరెంట్ తీగల పరిస్థితి చూస్తే అర్థం అవుతుందన్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేసే బీఆర్‌యస్ నాయకులకు కాలనీల సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. సామాన్యులపై విద్యుత్ ఛార్జీల మోత మోపే నాయకులకు రోడ్ల మధ్యలో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు కనపడవా అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వెలగ శ్రీనివాస్, విజిత్, ప్రభాకర్, రామాంజనేయ రెడ్డి, రామకృష్ణ, నవీన్ గౌడ్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

భవనంపై నుంచి దూకి యువతి ఆత్మహత్య



రేణుక (ఫైల్)

మియాపూర్: ఓ యువతి భవనంపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డికి చెందిన నరేందర్, లత దంపతులకు కుమార్తె మోతే రేణుక(19) కుమారుడు ఉన్నాడు. మియాపూర్‌లోని నీలియ హైట్స్‌లో ఉంటున్నారు. రేణుక గోకరాజు కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతుంది. గత కొంత కాలంగా మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో ఇంట్లోనే చదువుకుంటుంది. మంగళవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో అపార్ట్‌మెంట్ 9వ అంతస్తుపై నుండి దూకింది. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు మియాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసి నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు తమ తల్లిదండ్రులకు తడి, పొడి చెత్తను ఎలా వేరు చేయాలి..ఏ రంగు డబ్బాలో ఏ చెత్త వేయాలి అనేది అవగాహన కల్పించాలని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని చైతన్య హైస్కూల్‌లో విద్యార్థులకు హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌డబ్ల్యూ సర్కిల్ ఇన్‌చార్జ్ సుమన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మెట్టుకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌లు ముఖ్య అతిథులుగా హాజయ్యారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ మన పరిసరాలు శుభ్రతపై అవగాహన ఉంటే రోగాల బారిన పడకుండా సురక్షితంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పరిధిలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. అయితే డిగ్రీ విద్యార్థినిని తీసుకెళ్లిన వ్యక్తిని అరెస్ట్ చేసి, ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు.

◆ చిప్స్ కొనడానికి వెళ్లి...

పటాన్‌చెరు ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 8వ తరగతి చదువుతున్న బాలిక(14) సోమవారం మధ్యాహ్నం తినడానికి చిప్స్ కొనుక్కుంటానని అమ్మమ్మకు చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో కంగారు పడిన ఆమె తన కూతురుకు జరిగిన విషయంచెప్పింది. మంగళవారం ఉదయం వరకూ ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

◆ డిగ్రీ విద్యార్థినిని తీసుకెళ్లిన వ్యక్తి అరెస్ట్

ఎస్ఐ రామనాయుడు కథనం ప్రకారం...పటాన్‌చెరు పట్టణంలోని ఓ కాలనీకి చెందిన డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని(17) సోమవారం కాలేజీకని ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తన కూతురు అదృశ్యమైందని, తండ్రి మంగళవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ విద్యార్థినిని కుటుంబసభ్యులకు అప్పగించి, తీసుకెళ్లిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

భార్యతో గొడవ పడి..

పటాన్‌చెరు టౌన్: భార్యతో గొడవపడిన భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ మహ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన ప్రశాంత్(27) ఓప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై తరచు ఇంట్లో గొడవపడేవాడు. సోమవారం రాత్రి కూడా మద్యం సేవించాక ఇంటికి వచ్చి భార్య, కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. అనంతరం బెడ్‌రూమ్‌లోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. కుటుంబసభ్యులు చూసేసరికి సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని కనిపించాడు. గమనించిన వారు వెంటనే ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పటాన్‌చెరులోని ఓ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి గోవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

గచ్చిబౌలి: కొండాపూర్ పోలీస్ క్యాంప్ పక్కన ఉన్న అలమేలు మంగా, పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను భారీగా చేస్తున్నారు. బుధవారం నుంచి 19వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని ముఖ్యఅతిథిగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ విచ్చేస్తారని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం గణపతి పూజతో ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారు. గురువారం మహాగణపతికి అష్టోత్తర శత కలశాభిషేకం, హారతి, మంత్రపుష్పం, గణపతి యంత్రపూజ, హోమం, శుక్రవారం నిత్య హోమం, అన్నదాన కార్యక్రమం, అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిత్యహోమం, నీరాజన మహా మంత్ర పుష్పం, అమ్మవారికి చతుర్వేది స్వస్తి వంటి పూజలను చేస్తారు. శనివారం మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 4.30 గంటల నుంచి విశేషాభిషేకం, రుద్రహోమం, రాత్రికి శివపార్వతుల కల్యాణం ,మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేస్తారు. చివరిరోజు ఆదివారం మల్లికార్జున స్వామి రథోత్సవం నిర్వహిస్తారు.

అంజయ్యనగర్‌లో..

అంజయ్యనగర్‌లోని భ్రమరాంబ మల్లికార్జున సమేత వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం నుంచి 19వ తేదీ వరకు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లను చేసింది. బుధవారం ఉదయం గణపతిపూజతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

17న భాగ్యలక్ష్మి ఆలయంలో..

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని భాగ్యలక్ష్మీ దేవి ఆలయ వార్షికోత్సవాన్ని ఈనెల 17వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త బిర్‌కడ్ తుకారాం తెలిపారు. ఉదయం 7.30 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం ..పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలన్నారు.